# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 10 మే 2025 SANGAREDDY


## మేరా భారత్ మహాన్



మేరా భారత్ మహాన్ నినాదం సిద్దిపేట పురవీధుల్లో మార్మోగింది. భారత ఆర్మీ ధైర్య సాహసాలను కొనియాడుతూ హిందూ సంఘాల నాయకులు, పలు సేవా సంస్థలు, వ్యాపార, కార్మిక, కర్షక సంఘాలు శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సైన్యంతోనే మేమున్నామని నినదించారు. – సిద్దిపేట టౌన్, మే 9

## హరితహారం మొక్కలపై గొడ్డలివేటు



జంబికుంట రహదారికి ఇరువైపులా నరికివేసిన హరితహారం చెట్లు

నిజాంపేట్, మే 9: రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని జంబికుంట గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మండల పరిధిలోని జంబికుంట గ్రామానికి వెళ్లే రహదారి ఎన్‌హెచ్ 161కు కిలోమీటర్ ఉంటుంది. గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను 2019లో బీఆర్‌ఎస్ హయాంలో జంబికుంట మాజీసర్పంచ్ మామిడి సాయమ్మ నాటించారు. అవి ఇప్పుడు పెరిగి వృక్షాలుగా మారి రహదారి నుంచి వెళ్లే వారికి నీడనిస్తున్నాయి. అంతేకాకుండా రహదారి నిండుగా, అందంగా కనిపిస్తూ అటుగా వెళ్లే వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కరెంట్ తీగలకు అడ్డు వస్తున్నాయని విద్యుత్ అధికారులు జేసీబీతో చెట్లను పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జంబికుంట రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన హరితహారం చెట్లు (ఫైల్)

# సలాం.. సైనికా

## దేశసేవలో కట్కూర్ ముద్దుబిడ్డలు

- త్రివిధ దళాల్లో వివిధ హోదాల్లో వంద మందికి పైగా సేవలు
- గర్వపడుతున్న గ్రామస్తులు

భారతమాతకు రక్షణగా... దేశ సరిహద్దుల్లో కాపలాదారుడిగా పనిచేసే భాగ్యం కలగడం అదృష్టం... ఈ అదృష్టం ఎందరికో రాదు.. చావు ఎన్నటికి తప్పదు... దేశం కోసం ప్రాణాలర్పిస్తే ఆ తృప్తి వేరు. అదే స్ఫూర్తితో దేశ త్రివిధ దళాల్లో వంద మంది వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని కట్కూరు వాసులు.

ఒకప్పుడది కల్లోల ప్రాంతం... పగలంతా పోలీస్ ఇనుపబూట్ల చప్పుళ్లు... రాత్రంతా విప్లవ పార్టీల కదలికలతో నిత్యం అలజడి నెలకొనేది. మూడు జిల్లాలకు సరిహద్దుల్లోని మారుమూల ప్రాంతమైన కట్కూర్ రెండున్నర దశాబ్దాల వరకు నక్సలైటు ఉద్యమానికి కంచుకోట. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏం జరిగినా పోలీసులు నేరుగా ఈ గ్రామానికి వచ్చి అమాయకులను చితికబాదేవారు. ఇదే సమయంలో అప్పుడప్పుడే చైతన్యవంతులు అవుతున్న యువత చదువులపై దృష్టిసారించారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సైనిక దళాల్లో చేరడం మొదలుపెట్టారు. ఒకరొకరుగా మొదలై వందమంది వరకు చేరారు. మూడున్నర దశాబ్దాల క్రితం మొదలైన ప్రస్థానంతో ఇప్పటి వరకు 100 మందికి పైగా కట్కూర్ వాసులు త్రివిధ దళాలు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తూ దేశసేవలో నిమగ్నమయ్యారు.



ఆర్మీ విధుల్లో భాగంగా గన్‌తో కట్కూర్ సైనికులు



అక్కన్నపేట మండలంలోని కట్కూర్ గ్రామ వ్యూ



కట్కూర్‌లోని త్రివర్ణ రంగుల్లోని బురుజు

అక్కన్నపేట, మే 9: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్‌కు చెందిన జేరిపోతుల డేనియల్ అనే యువకుడు 45 ఏండ్ల క్రితం తొలుత నావికా దళంలో చేరారు. తర్వాత అతడిని స్ఫూర్తిగా తీసుకుని వర్ష శ్రీనివాస్ అనే మరో గ్రామస్తుడు ఆర్మీలో చేరారు. ఇలా ఒకరి తర్వాత ఒకరితో నాడు మొదలైన ప్రస్థానం నేడు 100 మందికి పైగా చేరుకుంది. కట్కూరు నుంచి అన్ని కులాల యువత ఆర్మీలో పనిచేస్తున్నారు. గ్రామంలో ప్రధానంగా వ్యవసాయమే జీవనాధారం. రాష్ట్రంలో జరిగే ప్రతి ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో కట్కూరుకు చెందిన యువకులు ఎంపికవుతుండడం విశేషం. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన యువకులు ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తున్న వారిని ఆదర్శంగా తీసుకుని త్రివిధ దళాల్లో చేరేందుకు శ్రమిస్తున్నారు.ఆర్మీలో పనిచేస్తున్న గ్రామస్తుల సలహాలు, సూచనలు తీసుకుని కొందరు గ్రామంలోనే శిక్షణ పొందుతుండగా, మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఒక ఇంటిలో నుంచి ఇద్దరు అన్నదమ్ములు ఆర్మీలో పనిచేస్తుండగా, ఊరిలో సుమారు 20 కుటుంబాల నుంచి ఒక్కగానొక్క కొడుకు ఉన్న కూడా ఆర్మీలో పనిచేస్తున్నారు. జవాన్లకు పుట్టినిల్లుగా మారిన కట్కూరులోని పురాతన బురుజును జవాన్ల సేవలు, పోరాటానికి చిహ్నంగా మాజీ సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి సర్వాంగ సుందరంగా త్రివర్ణ రంగుల్లో ముస్తాబు చేయించారు. దేశానికి అన్నం పెట్టే రైతు... దేశాన్ని కాపాడే జవాన్ నినాదంతో బురుజు కింద భాగంలో జై జవాన్... జై కిసాన్ నినాదం రాయించారు. రైతు, జవాన్ల చిత్రాలను బురుజుపై వేయించారు.

### నర్సింహానాయక్ మృతితో పెరిగిన గౌరవం

కట్కూర్ పరిధిలోని రాజుతండాకు(ప్రస్తుతం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధి) చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ గుగులోతు నర్సింహానాయక్ పదేండ్ల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని కుసుమా జిల్లాలో ఎన్నికల బందోబస్తు విధులకు వెళ్లి మావోయిస్టులకు, జవాన్లకు జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడు అయ్యారు. దీంతో అప్పట్లో కట్కూర్‌లోని ఆర్మీ కుటుంబాల్లో భయం పట్టుకుంది. తమ బిడ్డలకు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని కలత చెందారు. కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉద్యోగాలను వదలి తిరిగి రావాలని కోరారు. కానీ, నర్సింహానాయక్ అంతిమయాత్రను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆ కుటుంబానికి ఆదుకుంది. నర్సింహానాయక్ జ్ఞాపకార్థం అతడి తండ్రి లింగయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ చీఫ్ కమాండెంట్, అప్పటి కరీంనగర్ జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు హాజరై విగ్రహావిష్కరణ చేశారు. నర్సింహానాయక్ అమరుడు కావడం కట్కూర్ సైనికుల్లో మరింత గౌరవాన్ని పెంచింది. దీంతో గ్రామ యువత ఆర్మీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. తన కొడుకు దేశం కోసం మరణించడం గర్వంగా ఉందంటూ నర్సింహానాయక్ తండ్రి లింగయ్య చెబుతుంటాడు. అతని జేబులో నిత్యం కొడుకు ఫొటో పెట్టుకుని దేశం కోసం తన బిడ్డ అమరుడు అయ్యాడని గర్వంగా చెబుతుంటాడు.



రాజుతండాలో ఏర్పాటు చేసిన అమరజవాన్ నర్సింహానాయక్ విగ్రహం



ఆర్మీలోని సైనికుల బృందం

## చెట్లు నరికినవారిపై చర్యలు తీసుకోవాలి

హత్నూర, మే 9: పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలే, వర్షాలు సమృద్ధిగా కురవాలనే సంకల్పంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా కోట్లాది మొక్కలు నాటించింది. ఆనాడు నాటిన మొక్కలు నేడు ఎక్కడ చూసినా ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. గ్రామాలు, పొలం గట్లు, ఖాళీ స్థలాలు, రోడ్లపక్కన మొక్కలు నాటి సంరక్షించారు. ఆ మొక్కలు వృక్షాలుగా మారి సత్ఫలితాలు ఇస్తున్నాయి. రెండేండ్ల క్రితం హత్నూర మండలం నాగులదేవులపల్లి బస్ స్టేజీ నుంచి గ్రామం వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించి సంరక్షించడంతో ఏపుగా పెరుగుతున్నాయి. విద్యుత్ తీగలకు అడ్డుగా మారుతున్నాయనే సాకుతో విద్యుత్ సిబ్బంది చెట్లను ఎక్కడికక్కడ నరికివేశారు. చిన్నచిన్న మొక్కల నుంచి ఏపుగా పెరిగిన చెట్ల వరకు నరికి రోడ్డుపక్కన పడేశారు. విద్యుత్ తీగలకు తగిలేంత పెద్దగా పెరగనప్పటికీ చిన్న మొక్కలను సైతం సగం వరకు నరికి వదిలేశారు. విద్యుత్ సిబ్బంది తీరుతో పచ్చనిచెట్లు నేలమట్టం అయ్యాయని గ్రామస్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నాగులదేవులపల్లి రోడ్డుపక్కన పెరుగుతున్న మొక్కలను సగభాగంలో నరికిన దృశ్యం

## నీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన

జిన్నారం, మే 9: నిండు వేసవిలో ఖాళీ బిందెలతో ఒకటో వార్డు గాంధీనగర్ మహిళలు కౌన్సిలర్ చంద్రయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రయ్య మాట్లాడుతూ... కాలనీలో రెండు నెలలుగా తాగునీటి ఎద్దడి నెలకొన్నా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నా రెండు నెలలుగా నీటిసమస్య పరిష్కరించడం లేదని మండిపడ్డారు. పైప్‌లైన్ వ్యవస్థలో లోపంతో నీళ్లు రావడం లేదని, నీటికోసం మహిళలు పడుతున్న ఇబ్బందులపై మిషన్ భగీరథ అధికారులు స్పందించాలని, కాలనీలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. మున్సిపల్ కమిషనర్, మిషన్ భగీరథ ఏఈలు తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కాలనీ మహిళలతో కలిసి కౌన్సిలర్ చంద్రయ్య హెచ్చరించారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గాంధీనగర్ కాలనీవాసులు



సిద్దిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

## సిద్దిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

సిద్దిపేట కమాన్, మే 9: వీర జవాన్ మురళీ నాయక్ మృతిపై సిద్దిపేటలో తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్టీ హాస్టల్ నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా భిక్షపతినాయక్ మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో దేశ భద్రత కోసం పోరాడుతూ పాక్ ముష్కరుల దాడిలో మురళీనాయక్ వీరమరణం చెందాడని.. ఈ విషయంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగు నాయక్, రమేశ్ నాయక్, సత్యనారాయణ నాయక్, పరశురాములు నాయక్, గోపి నాయక్, నాగరాజు నాయక్, ముని నాయక్, గోవర్ధన్ నాయక్, సాయి నాయక్, సంతోష్ నాయక్, నవీన్ నాయక్, గిరిజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైనికుల క్షేమం కోరుతూ హోమం

చేర్యాల, మే 9: ఆపరేషన్ సిందూర్ పేరిట పోరాడుతున్న భారత త్రివిధ దళాలకు భగవంతుడి అనుగ్రహం కలగాలని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం మహా గణపతి హోమం, నవగ్రహ మన్యు శత్రుజయ పాశుపత హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సైనికులకు మద్దతుగా మల్లన్న ఆలయం నుంచి చేర్యాల–కొమురవెల్లి ప్రధాన రహదారిలోని పోలీస్ బొమ్మ వరకు ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై మనదేశం చేస్తున్నది యుద్ధం మాత్రమే కాదని, ధర్మం కోసం, దేశ గౌరవం కోసం పోరాటం అని అన్నారు. దాయాది దేశానికి తగిన గుణపాఠం చెప్పే సమయం వచ్చిందన్నారు. మన సైనికులకు మల్లికార్జున స్వామి అనుగ్రహం కలిగి మరింత శక్తియుక్తులతో ఉగ్రమూకలను తుదముట్టించి, భారత దేశాన్ని విజయ పథాన తీసుకుపోవాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ స్థానాచార్యులు పి.మల్లయ్య, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, నర్ర అంజిరెడ్డి, కాగితా మోహన్ రెడ్డి, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య, ఒగ్గు పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న ఆలయ ఈవో తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగులు, అర్చకులు, ఒగ్గు పూజారులు

# అవినీతి జలగలు!

## ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన అవినీతి.. డబ్బులిస్తేనే అవుతున్న పనులు

- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని ప్రభుత్వ ఉద్యోగుల తీరు
- సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా పోలీస్‌స్టేషన్లు
- ఉన్నతాధికారుల వేధింపులకు క్షేత్రస్థాయి ఉద్యోగులు బలి
- వేలాది రూపాయల వేతనం.. లంచం డబ్బులు రానిదే కొందరు అధికారులకు నిద్రపట్టడం లేదు..
- కాంగ్రెస్ పాలనలో యంత్రాంగం ఇష్టారాజ్యం
- ఆరోపణలు వస్తున్నా చర్యలు శూన్యం



సిద్దిపేట, మే 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల్లో అవినీతి బాగా పెరిగిపోయింది. లంచం తీసుకునే అవినీతి అధికారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏశాఖ చూసినా ఏమున్నది గర్వకారణం...డబ్బులు ఇవ్వనిదే పనులు కావడం లేదు అన్నట్టుగా ఉంది పరిస్థితి. పైస్థాయి ఉద్యోగులు కింది స్థాయి ఉద్యోగులను, వారి వద్దకు వచ్చిన వారిని డబ్బులకు పీడిస్తున్నారు. పైఅధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది తప్పులు చేస్తున్నారు. వేలాది రూపాయల వేతనం వస్తున్నప్పటికీ కొందరు అధికారులు లంచాలకు ఆశపడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నిశాఖల్లో లంచాలు ఇవ్వనిదే పనులు కావడం లేదు. నిబంధనల ప్రకారం కావాల్సిన పనులకు సైతం డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా రెవెన్యూ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, పోలీస్, విద్యుత్, మున్సిపల్, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయ్, ఎక్సైజ్, పంచాయతీరాజ్ శాఖలతో పాటు కలెక్టరేట్లు, మండల పరిషత్‌లు, తహసీల్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో అవినీతి బాగా పెరిగింది. ఉన్నత స్థాయి అధికారులు లంచాల కోసం కింది స్థాయి ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పలువురు అధికారులు లంచాలు తీసుకొని పట్టుబడినా చాలామంది అధికారుల్లో మార్పు రావడం లేదు. పైగా లంచాలు తీసుకునేటప్పుడు తెలివిగా వారి డ్రైవర్, కుటుంబ సభ్యులు, తెలిసినవారి యూపీఐ నెంబర్ల ద్వారా లంచం డబ్బులు వేయించుకుంటున్నట్లు తెలిసింది. కొందరు మండల స్థాయి అధికారులు గ్రామాల పర్యటనకు వచ్చినప్పుడు క్షేత్రస్థాయి, గ్రామస్థాయి ఉద్యోగుల నుంచి పెట్రో, డీజిల్, ఫుడ్ ఖర్చుల కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. టూర్ విజిట్ పేరున ఉన్నతాధికారి వస్తున్నాడంటే కిందిస్థాయి ఉద్యోగికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఆ అధికారి ఫీల్డ్‌కు వచ్చాడంటే, అతనికి ఎంతో కొంత ముట్టజెప్పాలి, లేకపోతే రికార్డులు తీసుకుపోయి సాయంత్రం జిల్లా ఆఫీసుకు వచ్చి కలిసి పోవాలి అని ఆదేశాలు వస్తున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లాలో ఒక పంచాయతీ కార్యదర్శి తన దగ్గర డబ్బులు లేవని చెప్పినా వినకుండా ఒక అధికారి అతన్ని ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### పైసలిస్తేనే ఫైల్ కదిలేది..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి రాజ్యమేలుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ ఫైల్ క్లియర్ కావాలన్నా బహిరంగంగానే అధికారులు డబ్బులు అడగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇస్తేనే ఫైల్ క్లియర్ చేస్తున్నారు, లేకపోతే ఫైల్ తొక్కిపెడుతున్నట్లు తెలిసింది. అవినీతికి పాల్పడుతున్న అధికారులు తెలివిగా తప్పించుకొని, తమ కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది ఇరికించి బలిపశువులను చేస్తున్నట్లు జరుగుతున్న ఘటనలు చూస్తుంటే తెలుస్తున్నది. అవినీతి శాఖ అధికారులకు పట్టుబడ్డది కొద్దిమంది మాత్రమే ..అవినీతి శాఖ నుంచి తప్పించుకునే అధికారులు చాలామందే ఉన్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లాలో ఓ తహసీల్ కార్యాలయంలోకి విలేకరులకు అనుమతి లేదని ఏకంగా బోర్డు పెట్టారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఇటీవల మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు సంతోష్‌గౌడ్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఈ హోంగార్డు వెనుక అదే స్టేషన్‌లో పనిచేస్తున్న పైఅధికారులు ఉన్నారు. కానీ, పట్టుబడింది మాత్రం హోంగార్డు. అతని పైఅధికారులు సేఫ్ అయ్యారు. పట్టుబడక పోతే వాటాల కోసం అతని వద్ద ముక్కుపిండి తీసుకునే వారు. ఇది ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఇసుక, గంజాయి తదితర మాఫియాలకు పోలీసులే ముందుండి నడిపిస్తున్నారనే విమర్శలు జిల్లాలో బలంగా ఉన్నాయి.రాజకీయ నాయకులు మధ్యవర్తిత్వంతో పోలీస్‌స్టేషన్లు సెటిల్‌మెంట్లకు పూర్తి అడ్డాగా మారాయి. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తే ఎంతోకొంత ముట్టజెప్పనిదే పనికావడం లేదు.వ్యక్తిగత వివాదాలు,భూతగాదాల్లో తలదూర్చడం, అందినకాడికి దోచుకోవడం పోలీసులకు అలవాటుగా మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు పోలీస్ అధికారుల తీరు పోలీస్ శాఖకు మచ్చను తెస్తున్నది. నెలనెలా వసూళ్లకు ప్రత్యేకంగా ఒక చిరుద్యోగిని నియమించుకుంటున్నారంటే ఏ మేరకు వసూళ్లకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఏకంగా ఒక ఎస్సై అధికారి పార్టీ నాయకుడి బర్త్‌డే వేడుకలను ఏకంగా తన ఛాంబర్‌లో జరిపించి వివాదాస్పదమైన విషయం తెలిసిందే. క్రమశిక్షణకు మారుపేరు ఉన్న పోలీస్ శాఖకు ఆ శాఖ ఉద్యోగులే మచ్చ తెస్తున్నారు.

# అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు

## పట్టా రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



సదాశివపేట పట్టణంలోని అసైన్డ్ భూమిలో నిర్మించిన రేకుల షెడ్డు

సదాశివపేట, మే 9: సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని అసైన్డ్ భూమి సర్వే నెంబర్ 590/1/2/1లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అసైన్డ్ భూముల్లో కట్టడాలు నిర్మించడం, ఒకరి పేరు నుంచి మరొకరి పేరుపై బదిలీ చేయించడం చట్టవిరుద్ధం. ఓ కాంగ్రెస్ నాయకుడు తన అధికారాన్ని, పలుకుబడిని ఉపయోగించి అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు నిర్మించారు. అసైన్డ్ భూమిలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి కమర్షియల్‌గా అద్దెకు ఇచ్చాడు. వ్యాపార నిమిత్తం లీజుకు ఇచ్చి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. సాగుకు ఉపయోగించే అసైన్డ్ భూమి ఎలాంటి అనుమతులు లేకుండా రేకుల్ షెడ్డును నిర్మించి కమర్షియల్‌గా అద్దెకు ఇచ్చి డబ్బులు ఆర్జిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలు విలువ చేసే అసైన్డ్ భూమిలో నిర్మాణాలు చేపట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం. అసైన్డ్ భూమిలో అక్రమ రేకుల షెడ్డు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్, ఆర్డీవో, స్థానిక తహసీల్దార్, మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అసైన్డ్ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### అసైన్డ్ పట్టా రద్దు చేయాలి

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి. ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 590/1/2/1లో రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. షెడ్‌ను అద్దెకు ఇచ్చి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేసి భూమిని స్వాధీనం చేసుకోవాలి. అసైన్డ్ పట్టా రద్దు చేసి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి. రేకుల షెడ్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి.

– చింతా గోపాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్



అదనపు కలెక్టర్ మాధురికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు